# పునరావృత్తం

- మణిమేఖల

సమయం ఉదయం నాలుగు గంటలు. కార్తీక మాసపు చలిగాలులు శరీరాన్ని వణికించేస్తున్నాయి. అందుకుతోడు సన్నని వాన తుంపర. కృష్ణానదిలోని స్నానాల రేవు. బెజవాడ దుర్గమ్మను దర్శించే భక్తులతో, అయ్యప్పలతో, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో రేవు కిటకిటలాడుతోంది. దుర్గమ్మను దర్శించే భక్తులు విధిగా నదిలో స్నానం చేసిన తరువాతే మిగతా కార్యక్రమాలు చేపడతారు. స్నానం చేసేటప్పుడు నదీ దేవతను ప్రార్థిస్తూ సంకల్పం చెప్పించుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం, సంప్రదాయమూనూ. కొన్ని తరాలుగా కృష్ణానది రేవును నమ్ముకొని కొన్ని పదుల కుటుంబాలు జీవన యాత్ర చేస్తున్నాయి. అందులో శేషావధాని ఒకడు. తూరుపు తెలవారకముందే నదిలో స్నానం చేసి, సశాస్త్రీయంగా నదీమతల్లికి ప్రార్థనాదికాలు ముగించి, సంకల్పం చెప్పించుకొనే భక్తులను వెదకటం అలవాటు. సరస్వతీ ప్రసన్నం వున్నా లక్ష్మీ ప్రసన్నం లేని బడుగుజీవి. ఎదుగూ బొదుగూ లేని జీవితం.

శేషావధాని గొంతు నెమ్మదిగా అరుస్తోంది.

బ్రాహ్మణులు కావలసిన వాళ్లు, బ్రాహ్మణులతో పని వున్నవాళ్లు, భక్తులు ఎవరి పనుల్లో వాళ్లు వున్నారు. అవధానిని పట్టించుకునే వాళ్లు లేరు. రేవులో అటూ ఇటూ తిరుగుతున్నాడు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న భార్య గుర్తుకువచ్చింది. మూడు రోజులుగా ఖాళీ సంచీతో ఇంటికి వెళుతున్నాడు. ఈ రోజైనా దుర్గమ్మ కరుణిస్తే ఏవైనా మందులు ఇంటికి తీసుకెళ్లొచ్చు అనుకుంటున్నాడు.

'ఏంc పంతులుగోరూ! ఇంకా బేరాలు ఏం తగలనేదు ఏటి?' కాఫీ, టీలు అమ్ముకునే అసిరినాయుడి పలకరింపు.

'ఇంకా లేదయ్యా! ఈ రోజు కూడా అమ్మ దయ లేదు' మాటల్లో నిరాశ, ఏమీ చెయ్యలేని నిస్సహాయత.

'మరేం పర్లేదు పంతులుగోరు- ముందు కాస్త గొంతు తడుపుకోండి. పోనీ, నన్ను ఏమన్నా డబ్బులు సద్దమంటారా ఏటి' అన్నాడు.

'వద్దు కానీ, కాసిని పాలు ఇయ్యి- వెళ్లేటప్పుడు చిల్లర ఇచ్చేస్తా.'

సూర్యుడు క్రమంగా పైకి లేస్తున్నాడు. స్నానం చేసే జనం పలచబడుతున్నారు. అవధాని రేవుకు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు తిరుగుతూనే వున్నాడు.

అప్పుడే పెళ్లయిన జంట సరిగంగ స్నానాలు చెయ్యటానికి వచ్చారు.

'అయ్యా... సంకల్పం చెప్పించుకుంటారా! మీకు, మీ కుటుంబానికి శుభం కలుగుతుంది' అడుగుతున్నాడు అవధాని.

'సరేc ఏం పుచ్చుకుంటావు' యువజంటలో ఓ గొంతు.

'ఏదోc మీకు తోచినంత. బ్రాహ్మడి భోజనం ఖర్చు.'

'అయ్యా... ఇద్దరూ చేతులు పట్టుకుని నదిలో మునగండి.'

గంగేచ- యమునేచ... మంత్రం శ్రావ్యంగా వినపడుతోంది. అతని గొంతులోని మాధుర్యానికి కృష్ణమ్మే పులకించినట్లు అతని పాదాలను అలలతో కడుగుతోంది.

సంకల్పం పూర్తయింది.

'బాబూ... దక్షిణ' అనగానే ఇరవై రూపాయల నోటు, కాస్త చిల్లర తాంబూలంలో పెట్టి ఇచ్చారు.

'మందుల సంగతి ఎలా వున్నా, ఈ పూట భోజనానికి అయినా అమ్మ కరుణించింది' అనుకుంటున్నాడు.

తాంబూలం బొడ్లో దోపుకుని మెట్లపైకి వచ్చాడు. అసిరినాయుడు కనపడగానే బొడ్లోని



తాంబూలం పైకి తీసి చిల్లర తీసిచ్చాడు. ఏదో అనుమానం వచ్చి నోటు తీసి చూశాడు– అంతా చిరుగులమయం. ఎందుకూ పనికిరాని వ్యర్థ కాగితం.

మెట్లు దిగి క్రిందకు వెళ్లాడు.

కృష్ణమ్మకు నమస్కారం చేస్తూ– 'అమ్మా... నా కష్టానికి ప్రతిఫలమా ఇది. ఈ కష్టం నువ్వే వుంచుకోం' అంటూ తాంబూలంతోపాటు నదిలో వదిలేశాడు.

ఖాళీ సంచితో, కాళ్లు ఈడ్చుకుంటూ దినవాహినీ సత్రం మీదుగా ఇంటిదారి పట్టాడు. దినవాహినీ అపకర్మలు చేసే సత్రం. పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేసే చోటు. ఎవరిదో కర్మకాండలు జరిపిస్తున్నాడు రామశాస్త్రి.

శాస్త్రి బహు లౌక్యుడు. అవధానిని చూడగానే మొఖం చిట్లించాడు. 'ఏం పని నీకిక్కడ! వెళ్లు.. వెళ్లు..' అని అరుస్తున్నాడు.

'శాస్త్రిగారూ! రెండు రోజుల నుండి బియ్యం నిండుకున్నాయి. మీరు ఏదైనా స్వయంపాకం ఇప్పిస్తే...'

'ఈపాటికి వచ్చావులే, వెళ్లు.. వెళ్లు..' కసురుకున్నాడు రామశాస్త్రి.

'పోన్లెండి... ఈ పూటకు భోజనం చేసి వెళతాడు' యజమాని అంటున్నాడు.

'మీకు వీళ్ల సంగతి తెలియదండి... ఒకసారి లోపలకు రానిస్తే, ఇంక అంతే సంగతులు. జలగల్లా పట్టి పీడిస్తారు. మీరు కానివ్వండి– వేళ మించిపోతోంది.'

అవధాని కాళ్లు ఈడ్చుకుంటూ ఇంటిదారి పట్టాడు.

చిన్న గది. దానిని ఆనుకుని చిన్న వసారా. నేలమీద మూలుగుతూ పడుకొని వుంది జోగులాంబ. గదిలో మూలగా వున్న బిందెలో నీళ్లు ముంచుకొని తాగి, చాపమీద నడుం వాల్చాడు.

'ఏమండీ– ఈ రోజు కూడా...'

'అవునే– మనకు ఈ రోజు కూడా ఏకాదశే.'

'పోన్లెండి– ఈ రోజు కాకపోతే రేపు. మీరేం చింతపడకండి. మన సంగతి ఎలా వున్నా– పిల్లాడికి వారాలు దొరికాయి. లేకపోతే వాడి ఉసురు కూడా మనకు తగిలేది.'

'అమ్మా జోగులాంబా... నిన్నే' అంటూ ఎవరిదో పిలుపు.

ఎవరో పెద్ద ముత్తయిదువ– మొఖంలో దైవ తేజస్సు.

'పంతులుగారూ... నేను మీకు తెలియదు కానీ, మిమ్మల్ని రోజూ కృష్ణ దగ్గర చూస్తూనే వుంటా. ఈ రోజు మా మామగారి ఆబ్దికం. ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. అత్యవసర పనిమీద మావారు ఊరు వెళ్లారు. ఇంకా రాలేదు. వేళ మించిపోయింది. కనీసం– స్వయంపాకం అన్నా ఇద్దామని వచ్చాను. దయచేసి స్వీకరించండి...' అంటూ పది రోజులకు సరిపడా సంబరాలు తెచ్చింది.

అమ్మా... ఈ రూపంలో ఆదుకున్నావా' అని అనుకుంటూ కనిపించే అన్నపూర్ణకు, కనిపించని కృష్ణమ్మకు నమస్కరించాడు.

❖ ❖ ❖

అది కార్తీక మాసం ఆఖరి రోజు. ఆ రోజు పోలీని స్వర్గానికి పంపించే రోజు. కృష్ణమ్మ ఆనందంతో ఉరకలు వేస్తోంది. చీకట్లు కళ్లు తెరవకముందే కృష్ణకు బయలుదేరాడు. అవధాని కృష్ణలో మెడ లోతు నీళ్లలో మునిగాడు. వేద మంత్రాలు అందుకున్నాడు. ఒకటి తరువాత ఒకటి కృష్ణా ప్రవాహంతో పోటీపడుతోంది. అతని స్వరం, అతని మంత్రాల స్థాయి పెరిగింది. వీటితోపాటే కృష్ణమ్మ కూడా పెరగటం మొదలుపెట్టింది. కళ్లు, నుదురు కూడా దాటిపోయాయి. అంతే... కృష్ణమ్మ మరో ప్రాణాన్ని నదిలో కలిపేసుకుంది.

కొన్ని వారాల తరువాత రామశేషు– అవధాని కొడుకు. తెల్లవారక ముందే నదికి రావటం మొదలుపెట్టాడు. అచ్చం తండ్రి పోలికే. బ్రాహ్మణులు కావలసినవాళ్లు, బ్రాహ్మణులతో పనివున్న వాళ్లు– మీకు రామశేషును చూడాలనివుంటే పొద్దున్నే కృష్ణానదికి వెళ్లండి. ●

## నువ్వు–నేను

నీ లేత చిగురు
నవ్వుల పరామర్శకు
నేను సుమడోలల్లో
ఊగులాడతాను
నీ పలకరింపుల
పూలగుచ్ఛాలు
అందుకున్నప్పుడు
శీతల పవన పరిమళాలు
ఆస్వాదిస్తాను
నీ తిరస్కార వాడి బాణాలు
ఎద పొదలో
గుచ్చుకున్నప్పుడు
పక్షిలా
గిలగిలలాడతాను

– మాధవీ సనారా